శిథిలావస్థకు చేరిన కల్వర్టు

- కుంగిపోయి ప్రమాదకరంగా మారిన భీమలింగం కాల్వపై కల్వర్టు
- ఇబ్బందులు పడుతున్న కూరెళ్ల–రాఘవాపురం గ్రామస్తులు

ఆత్మకూరు(ఎం): మండలంలోని కూరెళ్ల–రాఘవాపురం గ్రామాల మధ్య భీమలింగం కాల్వపై ఉన్న కల్వర్టు కుంగిపోయి శిథిలావస్థకు చేరింది. పల్లెర్ల చెరువు నుంచి కూరెళ్ల మీదుగా మోత్కూరు మండలం పాలడుగు చెరువులోనికి భీమలింగం కాల్వ ద్వారా సాగునీరు ప్రవహిస్తుంది. కాల్వ కూరెళ్ల గ్రామ చివరన ఉంటుంది. సుమారు 40 సంవత్సరాల క్రితం దీనిని నిర్మించారు. ప్రస్తుతం కల్వర్టు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది.

రాకపోకలకు అంతరాయం

కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలకు అంతరాయంగా మారింది. ఇటీవల యూరియా లోడు లారీ గుంతలో దిగబడడంతో రెండు రోజులు రాకపోకలు బంద్ అయ్యాయి. అంతేకాకుండా రాత్రి సమయంలో ఈ గుంతలో ద్విచక్ర వాహనాలు పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం మోత్కూరు నుంచి రాఘవాపురం, నర్సాపురం గ్రామాలకు ఈ కల్వర్టు మీదుగా ప్రైవేట్ స్కూల్ బస్సులు వెళ్తుంటాయి. అదేవిధంగా నర్సాపురం, రాఘవాపురం నుంచి ప్రైవేట్ వాహనాలు వెళ్తుంటాయి. అధికారులు స్పందించి, నూతన కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన కల్వర్టు



కుంగిపోవడంతో కల్వర్టుపై ఏర్పడిన గుంత

ప్రమాదకరంగా ఉంది

కూరెళ్ల– రాఘవాపురం గ్రామాల మధ్య కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. మోత్కూరు, ఆత్మకూరు(ఎం) వెళ్లడానికి ఈ దారి తప్ప ఇంకేదారి లేదు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలి.

– కూరెళ్ల మత్స్యగిరి, రాఘవాపురం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



కల్వర్టు శిథిలావస్థకు చేరి ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. ఈ సమస్యను ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత దృష్టికి తీసుకువెళ్లాం. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడగా..వారు వచ్చి కల్వర్టును పరిశీలించి, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.

– బాషబోయిన ఉప్పలయ్య యాదవ్, సర్పంచ్, కూరెళ్ల

క్లుప్తంగా

అభివృద్ధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

తుర్కపల్లి : ముఖ్యమంత్రి దత్తత గ్రామం వాసాలమర్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వాసాలమర్రిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్దేశిత గడువు లోపల పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు ఎప్పటి కప్పుడు పనులు పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోగుల ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు పలుగుల నవీన్‌కుమార్, డీపీఓ సునంద, ఈడీ శ్యాంసుందర్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి

వలిగొండ : రైల్వే భాగస్వామ్యంతో తపాలా శాఖ అందించే కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని నల్గొండ నార్త్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న పరిశ్రమల కోసం 23 టన్నుల సామర్థ్యంతో కూడిన ప్రత్యేక రైల్వే భోగిని తపాలా శాఖకు కేటాయించినట్లు తెలిపారు. సరుకులు ప్రమాదవశాత్తు పాడైతే పరిహారం పొందడానికి బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్, శంకర్, అశోక్, నగేశ్, శ్రీనివాస్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

దివీస్ సేవలు అభినందనీయం

వలిగొండ : దివీస్ పరిశ్రమ గ్రామాల్లో చేపడుతున్న సేవలు అభినందనీయమని మండలంలోని గోకారం సర్పంచ్ రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సంగెం నుంచి గోకారంలోని రామసముంద్ర చెరువు వరకు ఉన్న ధర్మారెడ్డి పల్లి కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క ఆకును తొలగించేందుకు దివీస్ పరిశ్రమ యంత్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ యంత్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, వైస్ ఎంపీపీ బాధరాజు ఉమా బాల్ నరసింహ, తుర్కపల్లి సురేందర్, సత్యనారాయణ, కాసుల కృష్ణ, వల్లూరి వెంకట్ రాజు, సాయి కృష్ణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని రామాజీపేట గ్రామ పంచాయతీ కార్మికుడు దేశ పాండ్య జంగయ్య ఆకస్మాత్తుగా గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. దీంతో వారి కుటుంబానికి పాలక వర్గం సానుభూతిని తెలిపి, తెలంగాణ ప్రభుత్వం తరఫున రూ.10,000, సర్పంచ్ మొగిలిపాక తిరుమల రమేష్ రూ. 5000 శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శేఖర్ రెడ్డి, సెక్రటరీ నరేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని పదో వార్డుకు చెందిన చెక్క రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ భువనగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పంజాల రామాంజనేయులు గౌడ్ అందించిన రూ.10వేల ఆర్థిక సాయాన్ని పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, కౌన్సిలర్ మోటె రజిత రాజులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌గౌడ్, వెంకటేశ్, చందు, జయసూర్య పాల్గొన్నారు.

సీపీఎం శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరణ

వలిగొండ : ఈనెల 12, 13 తేదీల్లో మండల కేంద్రంలో నిర్వహించనున్న సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు, రామచంద్రం, సురేష్, నర్సింహా, భిక్షపతి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



గిరిజన మహిళతో మాట్లాడుతున్న చల్లమల్ల కృష్ణారెడ్డి

సంస్థాన్ నారాయణపురం : మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లమల్ల కృష్ణారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చల్లమల్ల కృష్ణారెడ్డి చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర లచ్చమ్మగూడెం, చిల్లాపురం, కొర్రతండా, డాకుతండా, రాధనగర్‌తండా, పోర్లగడ్డ తండా, వావిళ్లపల్లి గ్రామాల మీదుగా శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, సతీష్, జంగయ్య తదితరులు ఉన్నారు.

ప్రతీ కార్యకర్త కుటుంబాన్ని కాపాడుకుంటాం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

బొమ్మలరామారం : బీఆర్ఎస్ పార్టీకి బలం, బలగమైన కార్యకర్త కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఇండ్ల సత్యనారయణ ఇటీవల ప్రమాదవశాతు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి మంజూరైన బీఆర్ఎస్ పార్టీ బీమా రూ.2లక్షల చెక్కును శుక్రవారం మండల కేంద్రంలో అందజేసి మాట్లాడారు. ప్రతి కార్యకర్త యోగ క్షేమాలను చూసుకుంటూ వారి వెన్నంటే ఉండేందుకు సీఎం కేసీఆర్ కార్యకర్తలకు జీవిత బీమా సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుషంగుల సత్యనారయణ, జిల్లా నాయకులు మచ్చ శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ వడ్లకొండ అరుణా ఆనంద్, గణేష్, ప్రభాకర్ రెడ్డి, జూపల్లి భరత్, రాగుల బల్‌రామ్, తిర్మని నాగరాజు గౌడ్, మైలారం రామకృష్ణ, బోనంకూర మల్లేష్, బండి మహేష్‌గౌడ్, ఇండ్ల తిరుపతి పాల్గొన్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న విప్ సునీత

బాధిత కుటుంబానికి పరామర్శ

బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు ఎలబోయిన శ్రీహరి సోదరులు భాస్కర్ ఇటీవల మృతి చెందాడు. అలాగే మండలంలోని రామలింగంపల్లి గ్రామ సర్పంచ్ యంజాల కళ భర్త సత్యనారయణ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబాలను ప్రభుత్వ విప్ గొంగిడి సునీత శుక్రవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుధీర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుషంగల సత్యనారయణ, జిల్లా నాయకులు మచ్చ శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ జూపల్లి భరత్, బండి మహేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం హెడ్ కానిస్టేబుల్ అనిల్

యాదగిరిగుట్ట : విద్యార్థినులను, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని షీటీం హెడ్‌కానిస్టేబల్ అనిల్ అన్నారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు, విద్యార్థినులు సెల్‌ఫోన్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాట్సాప్ స్టేటస్‌లు, డీపీలు అవగాహన లేనిదే పెట్టరాదన్నారు. గుర్తు తెలియని నంబర్లు, చాట్ లాంటివి చేయకూడదన్నారు. ఈ అవగాహన సదస్సులో షీ టీం సిబ్బంది ప్రియాంక, రంగరావు, సక్రు నాయక్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన సదస్సు

చౌటుప్పల్ : విద్యార్థినులు సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.దీప అన్నారు. ఇటీవల నల్లగొండలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శుక్రవారం మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బంది వచ్చినా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులకు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో నవీన్, సాయికుమార్, దిలీప్, ముజాహిద్, శివ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎంపీ రూ.లక్ష ఆర్థిక సాయం



సర్పంచ్‌ను పరామర్శిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి

బొమ్మలరామారం : మండలంలోని రామలింగంపల్లి గ్రామ సర్పంచ్ యంజాల కళ భర్త సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య, మల్లేష్, శ్రీహరి నాయక్, రాజేష్ పైలెట్, లింగం ఉన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



మోత్కూరు : ముశిపట్లలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్

ఆత్మకూరు(ఎం) : అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని బీఎల్ఓలను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆత్మకూర్(ఎం) తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఓటరు నమోదు విషయంలో బీఎల్ఓలు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. చేర్పులు, మార్పులు, తొలగింపులు, డబుల్ ఓట్ల తిరస్కరణలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించేటప్పుడు కుటుంబ సభ్యుల నుంచి ప్రతిపాదనలు తీసుకోవాలని పేర్కొన్నారు. మార్పులు, చేర్పుల కోసం తగిన ఆధారాలు సమర్పించాలన్నారు. ధరణి ఫైళ్ల పెండింగ్ లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆడెపు అండాలు, సీనియర్ అసిస్టెంట్ పాండు, ఆర్ఐ చిప్పలపల్లి యాదగిరి ఉన్నారు.

తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల తనిఖీ

మోత్కూరు : మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను శుక్రవారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. రికార్డులు, ఓటరు నమోదు, ధరణి రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ఓటరు నమోదు పక్కాగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ముశిపట్ల గ్రామాన్ని సందర్శించి హరితహారం మొక్కలు, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డును పరిశీలించారు. డంపింగ్ నిర్వహణ, సేంద్రియ ఎరువు తయారీపై గ్రామ పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లక్ష్యం మేరకు హరితహారం మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీఓ రఫూఫ్‌అలీ, పంచాయతీ కార్యదర్శి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

భువనగిరి : తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరి పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు రుణమాఫీ పత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు సంవత్సరానికి రెండు సార్లు రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పీ ఏసీఎస్ చైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి, డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ ఇందిరా ప్రియదర్శిని, వైస్ చైర్మన్ మహేందర్ నాయక్, డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లేశం, సురేందర్‌రెడ్డి, ఎల్లమ్మ, సురేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

వలిగొండ : పౌష్టికాహారంతోనే పిల్లలు ఆరోగ్యంగా జీవిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణీ శ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని గోపరాజుపల్లిలో పోషక వారోత్సవాల్లో భాగంగా వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మణెమ్మ, మంజుల, సునీత , వినోద, సత్యనారాయణ రెడ్డి, లక్ష్మి, ఐలయ్య, స్వామి, పాల్గొన్నారు.

పోషకాహారం ఆరోగ్యానికి శ్రేయస్కరం

రామన్నపేట : గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యానికి శ్రేయస్కరమని సీడీపీఓ శాగంటి శైలజ, సర్పంచ్ కాటెపల్లి సిద్దమ్మ తెలిపారు. శుక్రవారం ఇంద్రపాలనగరంలో నిర్వహించిన శుక్రవారం సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమలత అంగన్‌వాడీ టీచర్లు సుజాత, రేణుక, సావిత్రి ఏఎన్ఎం అరుంధతి పాల్గొన్నారు.

మున్సిపల్ భూములను పరిరక్షించాలి

భూదాన్‌పోచంపల్లి : మున్సిపల్ భూములను పరిరక్షించాలని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి మున్సిపల్ పరిధిలోని శ్రీ మిత్ర టౌన్‌షిప్ పలాడియా ఫేజ్ 2లో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 707/పి, 712/పి నుంచి 718/పి వరకు గల సర్వే నంబర్‌లలో ఏర్పాటు చేసిన పలాడియా ఫేజ్ –2 వెంచర్‌లో 4ఎకరాల 81 సెంట్ల భూమిని పార్కు కోసం వదిలిపెట్టారన్నారు. అయితే జగత్‌పల్లి గ్రామానికి చెందిన ఉపేందర్‌రెడ్డి అనే వ్యక్తి పార్కు స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లు చేసి విక్రయించాడని తెలిపారు. వెంటనే అధికారులు విచారించి కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. అంతేగాక శ్రీమిత్ర టౌన్‌షిప్‌లో ఉన్న మున్సిపల్ భూములన్నింటిని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. అలాగే ఫెన్సింగ్ వేసి, అక్కడ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. వాటిని ప్రజా అవసరాల కొరకు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, మాజీ అధ్యక్షుడు గునిగంటి రమేశ్, బండారు ప్రకాశ్‌రెడ్డి, టింగిల్‌కార్ వెంకటేశ్, మక్తాల రమేశ్, జోగు శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, మోటె మహేశ్, ఇట్టమోని మహేందర్, జింకల కుమార్, జింకల జయసూర్య, చింతల శ్రీశైలం, బద్దం రాజేశ్వర్ పానుగంటి లింగస్వామి, కె. బీమయ్య, చందు పాల్గొన్నారు.



ఆక్రమణకు గురైన భూములను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీనియర్ న్యాయవాది వాసుదేవరావు మృతి



రామన్నపేట : సీనియర్ న్యాయవాది, విజ్ఞానవర్ధిని హైస్కూల్ కరస్పాండెంట్ అక్కెనపల్లి వాసుదేవరావు శుక్రవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి సంతాప సూచకంగా స్థానిక కోర్టులలో సంతాపం ప్రకటించారు. వాసుదేవరావు సేవలను న్యాయమూర్తులు ప్రదీప్, చందన లు కొనియాడారు. న్యాయవాదులు సుభాష్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు యాపాల క్రిష్టారెడ్డి, యాదగిరిస్వామి, కాంపాటి యాదగిరి, దూశర్ల నరేందర్‌రావు, జినుకల ప్రభాకర్, శోభన్‌బాబు, మొగులయ్య, హన్మంత్, మామిడి వెంకట్‌రెడ్డి, కేమ రామదాసు, జగతయ్య, అశోక్, డేవిడ్, బాలరాజు, శ్రీశైలం, లింగస్వామి శ్రవన్‌కుమార్ పాల్గొన్నారు.

భువనగిరి : సీనియర్ న్యాయవాది అక్కెనపల్లి వాసుదేవరావు మృతి కి సంతాపంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య, న్యాయవాదులు శ్రీనివాస్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, కేశవ రెడ్డి, మల్లేష్, బాబురావు, రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

చౌటుప్పల్ : సీనియర్ న్యాయవాది అక్కెనపల్లి వాసుదేవరావు మృతి బాధాకరమని చౌటుప్పల్ బార్‌అసోసియేన్ అధ్యక్షుడు వాకిటి నర్సింహారెడ్డి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలోవాసుదేవరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. న్యాయవాద వృత్తిలో దశాబ్దాల పాటు అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార పరమేష్, తాడూరి పరమేష్, అవినాష్, వెంకటాచలపతి, శ్రీనివాస్, సత్తిరెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

'పైరవీలు చేసుకున్న వారికే దళిత బంధు'



దళిత కుటుంబాలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట : ఆలేరు నియోజకవర్గంలో అధికార పార్టీలో ఉంటూ పైరవీలు చేసుకున్న వారికే దళిత బంధు పథకాన్ని అమలు చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య ఆరోపించారు. యాదగిరిగుట్ట పట్టణంలో శుక్రవారం గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన సుమారు 30దళిత కుటుంబాలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుద్దాల గ్రామంలో 40 దళిత కుటుంబాలు ఉంటే.. కేవలం మూడు దళిత కుటుంబాలకే దళిత బంధు ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. పార్టీలో చేరిన వారిలో మబ్బు యాదగిరి, బద్దుల ఎల్లయ్య, మబ్బు పెద్ద యాదయ్య, ఎర్ర భాష, నవీన్, నరేష్, నర్సింహ, లక్ష్మీనర్సయ్య, వెంకటయ్య, నర్సింహ, చంద్రయ్య, యాదమ్మ, సోమక్క, శార్మ, అనితలతో పాటు పలువురు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



చౌటుప్పల్ : బాలికల గురుకులంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



రామన్నపేట : శ్రీహిందూ కళాశాలలో..

చౌటుప్పల్ : విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సరోజమ్మ అన్నారు. గురుకులంలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు సీనియర్లు స్వాగతం పలికారు. ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రామన్నపేట : విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష సాధనకు కృషి చేయాలని శ్రీ హిందూ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పనకంటి భాస్కర్‌రావు తెలిపారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించి ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొని మట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బండారు శ్రీదేవి, అధ్యాపకులు వి.దేవేందర్‌రావు, లింగస్వామి, శ్రీనివాస్, మాధవి, రేష్మా, సుజాత, సునీల్, వెంకటేష్ పాల్గొన్నారు.

'మేరీ మాటి.. మేరా దేశ్' లో భాగస్వాములు కావాలి

బీబీనగర్ : దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా అమరుల స్మృతి వనం, అమృత వాటిక నిర్మాణ కోసం ప్రధాని మోదీ చేపడుతున్న మేరీ మాటి.. మేరాదేశ్ కార్యక్రమంలో దేశ ప్రజలంతా భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వీధుల్లో చేపట్టిన మట్టి సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగారెడ్డి, నరోత్తమరెడ్డి, రాజేందర్, ప్రభాకర్, లక్ష్మారెడ్డి, పరంకుశం, శ్రీధర్, శివకుమార్, రాజేంధర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం మేరీ మాటి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మట్టి సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ భిక్షంగౌడ్, అధ్యక్షుడు రిక్కల సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు రమేష్‌గౌడ్, లావణ్య, స్వప్నశ్రీనాథ్, తదితరులు ఉన్నారు.

సంస్థాన్ నారాయణపురం : పీఎం మోదీ పిలుపుమేరకు మేరీ మాటి... మేరీ దేశ్ అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమాన్ని మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరపల్లి శివాజీ, గిరి, యాదయ్య, జగత్, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.



బీబీనగర్ : మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

యాదగిరిగుట్ట : 'మేరీ మాటి – మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుండ్లపల్లిలో ఇంటింటికి తిరుగుతూ మట్టిని సేకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు భువనగిరి శ్యాంసుందర్, సీనియర్ నాయకులు లెంకలపల్లి శ్రీనివాస్, రంగ సత్యనారాయణ, తాళ్ల భాస్కర్ రెడ్డి, బొమ్మగాని రాజమణి, తాళ్ల ఉమా, రంగ రేఖా, జంపాల శ్రీనివాస్ తదితరులున్నారు.

పేద విద్యార్థిని ఉన్నత విద్యకు ఆర్థిక చేయూత

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రానికి చెందిన నిరుపేద చేనేత కార్మిక కుటుంబానికి చెందిన భారత రమ్య ఇంజనీరింగ్ చదువుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఇక్కత్ వరల్డ్ ఫౌండేషన్ ద్వారా సేకరించిన రూ.76,857ల నగదును శుక్రవారం స్థానిక జెడ్పీ స్కూల్ ఆవరణలో రమ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇక్కత్ వరల్డ్ ఫౌండర్ చైర్మన్ గంజి యుగేందర్, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు సూరెపల్లి రాము, సుధాకర్, అరవింద్, నరేశ్, రాజేందర్, నవీన్ పాల్గొన్నారు.

ఏబీవీపీ దిష్టిబొమ్మ దహనం

భువనగిరిటౌన్ : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మతోన్మాద ఏబీవీపీ నాయకులు ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడిని ఖండిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏబీవీపీ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర అనిల్, వనం రాజు మాట్లా డారు. ఈ కార్యక్రమంలో చింతల శివ, నాగరాజు పాల్గొన్నారు.

వలిగొండలో : ఎస్ఎఫ్ఐ నాయకులపై సంగారెడ్డిలో ఏబీవీపీ నాయకుల దాడిని ఖండిస్తూ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ఏబీవీపీ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు.

స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలి

భువనగిరిటౌన్ : నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట 9వ రోజు నిన వదిక సమ్మెలో భాగంగా ఎన్‌హెచ్ఎం కార్మికులు ఒంటికాలపై నిలబడి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా శోభన్ బాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేసీఆర్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి, నేటికీ దశాబ్ద కాలం పూర్తవుతున్నప్పటికీ హామీ నెరవేరలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు– ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు కామ్రాన్, దుర్గ, వినోద్, మధు, శ్రీదేవి, శిరీష, రమేష్, శ్రీనివాస్, సరిత, సౌజన్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

వలిగొండ : మండలంలోని పహిల్వాన్‌పురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పీపుల్స్ పర్ ఇండియా సంస్థ శుక్రవారం కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పబ్బతి సూరజ్, భృగుమల్ల వందన, అరవింద్, కస్తూరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తుర్కపల్లి : ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ తూటి వెంకటేశం అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ ఉద్యోగులతో కలిసి ఆయన తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగులు జ్యోతి, పుట్ట సునీత, లక్ష్మి, కొడపాల సునిత, స్వరూప, భాగ్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

దమరుక వాయిద్యం బహూకరణ

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని శివభక్త మార్కండేయస్వామి దేవాలయానికి నల్లగొండ జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ గోశిక బాలకృష్ణ శుక్రవారం డమరుక వాయిద్యాన్ని బహూకరించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు గోశిక నర్సింహ, ప్రధాన కార్యదర్శి గోశిక భావనాఋషి, ప్రతినిధులు రఘునాథ్, రామకృష్ణ, యాదగిరి, చంద్రయ్య ఉన్నారు.

కోలాటం మహిళలకు ఆర్థిక సాయం

వలిగొండ. : మండలంలోని రెడ్లరేపాకకు చెందిన కోలాటం మహిళలకు స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సమకూర్చిన రూ.20వేలను శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో శంకర్ గౌడ్, సందీప్ రెడ్డి, జహంగీర్, శ్రీను, కందుల మహేష్, ప్రవీణ్, చంద్రమౌళి, కోలాటం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల వంటావార్పు

భువనగిరిటౌన్ : తమ డిమాండ్లు పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు భువనగిరి కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 8 రోజుకు చేరుకున్న సందర్భంగా వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షుడు పాండరి, భాస్కర్ మాట్లాడారు. చాలీచాలని జీతాలతో దుర్భర జీవితం గడుపుతున్నామన్నారు.

భువనగిరిలో కాంగ్రెస్‌ను గెలిపిస్తాం

భువనగిరిటౌన్ : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తామని ఆ పార్టీ నియోజకవర్గం నాయకులు రామాంజనేయులు గౌడ్, ప్రమోద్‌కుమార్‌అన్నారు. శుక్రవారం రహదారి బంగ్లాలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జహంగీర్, అనంతరెడ్డి, హరిప్రసాద్, ప్రవీణ్, కృష్ణారెడ్డి ఉన్నారు.

ఇంటింటికి కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు అందజేత

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 5 గ్యారెంటీ పథకాలకు సంబంధించిన కార్డును శుక్రవారం యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఎండీ అవేస్ చిస్తీ ఆధ్వర్యంలో ఇంటింటికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వెలిమినేటి సురేష్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్, సుధాకర్, కొల్లూరు రాజు పాల్గొన్నారు.